ఆశల రుణాలు అర్హులకు అందేనా?

యూనిట్లు తక్కువ, దరఖాస్తులు ఎక్కువ

- కూటమి కార్యకర్తలకే పంచిపెట్టే యత్నం
- సామాన్యుల్లో సన్నగిల్లుతున్న ఆశలు
- నేటి నుంచి పరిశీలన, ఎంపిక

ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేవు. పని చేసుకుందామంటే పరిశ్రమలు లేవు. చిన్నపాటి వ్యాపారంతో స్వయం ఉపాధి పొందుదామంటే ఆర్థిక స్తోమత లేదు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయని తెలిసి సామాన్యులు సంతోషం వ్యక్తం చేసి వందల రూపాయలు ఖర్చుపెట్టి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ఆశల సబ్సిడీ రుణాలు సామాన్యులకు అందుతాయా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

దుత్తలూరు : మండలానికి పదుల చొప్పున యూనిట్లు మంజూరైనా దరఖాస్తులు మాత్రం వందల్లో వచ్చాయి. దీంతో పలువురు దరఖాస్తుదారులు స్థానికంగా ఉండే టీడీపీ నాయకుల చుట్టూ రుణాలు ఇప్పించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. యూనిట్ల కేటాయింపు జరిగిన రోజు నుంచే సబ్సిడీ రుణాలపై రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అన్ని అర్హతలు ఉన్న సామాన్యులు సైతం ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు కూటమి పార్టీలు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రగల్భాలు పలికింది. కానీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా హామీల అమలు ఊసే లేదు. ఇప్పటికే ఆరు హామీలు అమలు చేయకపోవడంతో సామాన్య ప్రజలు కూటమి ప్రభుత్వంపై రగిలిపోతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు సంబంధించి కేవలం 325 యూనిట్లు మాత్రమే కేటాయించింది. వీటిని బీసీలు, కాపు, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కేటగిరీలుగా విభజించి కేటాయించారు. ఈ రుణాల కోసం 2,098 మంది ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు కనీసం ఒకటి చొప్పునైనా మంజూరయ్యే అవకాశం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నామమాత్రంగా యూనిట్లు కేటాయించడంపై నిరుద్యోగ యువత, ఆశావహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉన్నా వీటిని దక్కించుకునేందుకు అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు పలుకుబడి ఉన్న నేతల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణ చేస్తున్నారు.

వందల్లో దరఖాస్తులు

ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ యూనిట్లు అంతంతమాత్రంగానే ఉండటం, ప్రతి మండలంలో దరఖాస్తులు వందల్లో రావడంతో తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకుల మధ్యే తీవ్ర పోటీ నెలకొనడంతో సామాన్యులు నిరాశ చెందుతున్నారు. అధికార పార్టీ వారిని దాటుకుని తమకు రుణాలు రావడం అసాధ్యమని నిర్ణయించుకుంటున్నారు. ఎలాగూ దరఖాస్తు చేశామని, ఓ ప్రయత్నం చేస్తే పోలా అన్నట్లుగా మరికొందరు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. సుమారు రూ.500కుపైగా ఖర్చు చేసి ఆన్‌లైన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత చదువులు అభ్యసించి ఖాళీగా ఉన్న యువతకు ప్రాముఖ్యత ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అయితే ఇప్పటికే ఆయా మండలాల్లో అధికారులకు కూటమి నాయకులు ఫలానా వారికే రుణాలు అందజేయాలని మౌఖికంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇక బుధవారం పలు మండలాల్లో దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. మిగిలిన మండలాలు కూడా తర్వాత తేదీల్లో జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే మండల స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొనే సర్టిఫికెట్ల పరిశీలన పేరుకే అన్నట్లుగా ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు.


దరఖాస్తులను సరిచేస్తున్న మండలాధికారులు


దుత్తలూరు మండల పరిషత్ కార్యాలయం

ఉదయగిరి నియోజకవర్గంలో

మండలాలు	యూనిట్లు	దరఖాస్తులు
దుత్తలూరు	44	248
సీతారామపురం	42	230
ఉదయగిరి	30	322
వరికుంటపాడు	46	259
జలదంకి	44	277
కొండాపురం	44	213
కలిగిరి	44	260
వింజమూరు	31	289
మొత్తం	325	2,098

అర్హతల మేరకు రుణాల మంజూరు

బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. పరిశీలన అనంతరం అర్హులైన వారిని బ్యాంకర్లు కలిసి ఎంపిక చేస్తాం. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీలు ఏమీ లేవు. దరఖాస్తు చేసుకున్నవారు హాజరు కావాలి.


– మీసాల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, దుత్తలూరు

క్లుప్తంగా

ఏటీఎం ఏర్పాటుకు వినతి


వినతి పత్రం ఇస్తున్న వినియోగదారులు

వరికుంటపాడు : మండల కేంద్రమైన వరికుంటపాడులో కెనరా బ్యాంక్ ఏటీఎంను ఏర్పాటు చేయాలని వినియోగదారుల ఫోరమ్, పలువురు ఖాతాదారులు స్థానిక బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికుంటపాడులో ఏటీఎం లేకపోవడంతో ఖాతాదారులు, ప్రజలు 12 కిలోమీటర్ల దూరంలోని ప్రకాశం జిల్లా పామూరుకు లేదా 20 కిలోమీటర్ల దూరంలోని దుత్తలూరుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఏటీఎంను ఏర్పాటు చేయాలన్నారు. ఫోరమ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వెంకటమోహన్, సభ్యులు లక్ష్మీనారాయణ, వెంగమనాయుడు, పెదమాలకొండయ్య పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ పావని

ఉదయగిరి : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, అర్జీల నివేదికలను పరిశీలించి తహసీల్దార్ సుభద్రకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 365 అర్జీలు వచ్చాయని, వాటిలో 60 వరకు పరిష్కరించాల్సి ఉందన్నారు. డీటీ షాజీయా పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

కొండాపురం : మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 127 మంది విద్యార్థులకు స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా మంగళవారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాగా చదివి పాఠశాలతో పాటు తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. టీడీపీ నేతలు దామా మహేష్, పోలినేని చంద్రబాబా, అంబటి సురేంద్ర, మందపల్లి మాదవరావు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి



చేజర్ల : మండలంలోని చిత్తలూరు, తూర్పుపల్లి, తూర్పు కంభంపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులు మార్చి 6వ తేదీ వరకు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరేళ్లలోపు చిన్నారులకు సంబంధించి తల్లిదండ్రులు స్పెషల్ ఆధార్ క్యాంపుల్లో నమోదు చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా కార్డులో పేరు మార్పులు, చిరునామాలను నమోదు చేసుకోవచ్చన్నారు. కాగా చిత్తలూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ మంగమ్మ పాల్గొన్నారు.

గేదెను ఢీకొన్న బైక్

- ఇద్దరికి గాయాలు


గాయపడిన పెంచలమ్మ, లక్ష్మీనరసారెడ్డి

సీతారామపురం : గేదెను బైక్ ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన స్థానిక ఊరచెరువు సమీపంలో రాజుగారి కొట్టాలు రోడ్డు సెంటర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దుత్తలూరు మండలం సోమరేగడకు చెందిన లక్ష్మీనరసారెడ్డి, పెంచలమ్మలు వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని బాలాయపల్లిలో జరిగే తిరునాళ్లకు బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యలో రాజుగారి కొట్టాలు వద్ద హైవేపై గేదె అడ్డుగా రావడంతో పడిపోయారు. దీంతో వారి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పశు బీమాకు నమోదు చేసుకోవాలి

వరికుంటపాడు : పశు బీమా పథకానికి మండలంలోని పశుపోషకులు నమోదు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రాల్లోని పశుసంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించాలన్నారు.

ఇంటింటికీ తాగునీరు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న సర్వే బృందం

ఉదయగిరి : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్ ప్రధాన లక్ష్యమని ఉదయగిరి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణారావు తెలిపారు. పట్టణంలోని షబ్బీర్‌కాలనీ సమీపంలో ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు పూణేకు చెందిన సమర్థ్ ఇన్ఫోటెక్ సంస్థ బృందం చేపట్టిన సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని షబ్బీర్ కాలనీ, కొండాయపాళెం, బోడబండ, లింగమనేనిపల్లి గ్రామాల్లో ఓటీహెచ్ఆర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి సోమశిల జలాలను నింపి పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ సర్వేను మార్చి 15లోపు పూర్తిచేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఏఈ జగన్నాథం, ఇంజినీరింగ్ సహాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు



కలిగిరి : బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలిగిరి పంచాయతీకి సంబంధించి 98 మంది దరఖాస్తుదారులకు 76 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జూనియర్ అసిస్టెంట్ దీక్షితులు, కలిగిరిలోని ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం


దుత్తలూరు : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరీష్


ఉదయగిరి : అవగాహన కల్పిస్తున్న వెంకటసుబ్బయ్య

దుత్తలూరు : క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని నర్రవాడ వైద్యాధికారి హరీష్ పేర్కొన్నారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన క్షయ వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తరచుగా దగ్గు, జ్వరం వస్తున్నప్పుడు గళ్ల పరీక్షల ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. హెచ్‌ఎం జయరాములు, సీహెచ్‌ఓ ఓంకారయ్య, హెల్త్ సూపర్‌వైజర్ అరుణకుమారి, ఖాజామొహిద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ మానస, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఉదయగిరి : గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలోని బిజ్జంపల్లి ఉన్నత, జి.చెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి గాలి, తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. దీనిని మందులతో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు పోషకాహార నిమిత్తం రూ.500 నగదు ఇస్తారన్నారు. పెద్దలు, పిల్లలు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణ పర్యవేక్షకుడు బి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధి మంత్రికి పట్టదా..?

- ఎంపీపీ పద్మజారెడ్డి
- సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు

అనుమసముద్రంపేట : 'ప్రజా ప్రతినిధులను అగౌరవ పరచడమే ప్రభుత్వ లక్ష్యమా.. గ్రామాల అభివృద్ధి మంత్రికి పట్టదా..' అంటూ ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై ఎంపీడీఓపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా 15వ ఆర్థిక సంఘం నిధుల గురించి ఎంపీడీఓను అడిగినా ఇంత వరకు స్పందించడం లేదని వాపోయారు. మూడు నెలల క్రితం జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గత నెలలో జరిగిన జెడ్పీ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభివృద్ధి పనులకు ఎవరూ ఆటంకం చెప్పొద్దంటూ తీర్మానం చేశారని, కానీ ఏఎస్‌పేట మండలాభివృద్ధిని టీడీపీ నేతలు ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా పనులు చేయాల్సిన ప్రభుత్వాలు ఏఎస్‌పేట మండలంపై ఎందుకు అశ్రద్ధ చూపుతున్నారో తెలపాలన్నారు. గుంపర్లపాడు రోడ్డు పనుల విషయంలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చాలన్నారు. సమస్యలపై ప్రభుత్వం ఎప్పుడు స్పందిస్తుందో చెప్పాలని పట్టుబడుతూ వైఎస్సార్‌సీపీ సర్వసభ్య సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బాయ్‌కాట్ చేస్తూ బయటకు వచ్చి నినాదాలు చేశారు. దీంతో సర్వసభ్య సమావేశం పూర్తిస్థాయిలో వాయిదా పడింది. అనంతరం ఎంపీడీఓ ప్రసన్నకుమారి మాట్లాడుతూ రెండు రోజుల్లో వర్కులు ఇస్తామని, పూర్తిస్థాయిలో 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు తెలియజేస్తామన్నారు.


రైతులకు శిక్షణ



సంగం : మండలంలోని పడమటిపాళెం రైతు సేవా కేంద్రంలో పోషకాహార ధాన్యాల యాజమాన్యం, ఉత్పత్తులపై అన్నదాతలకు మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి, శాస్త్రవేత్తలు సురేఖాదేవి, హసీనాబాను పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. రాగులు, జొన్నలు, సజ్జలు పండించే రైతులు కూడా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

చేజర్ల : భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదురుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ డేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్ల భాషకు సంబంధించిన టీఎల్ఎం, వర్కింగ్ మోడల్స్‌ను తయారు చేసి ప్రదర్శించారు. హెచ్‌ఎం రమేష్‌బాబు, ఆంగ్ల ఉపాధ్యాయులు అబ్దుల్ షరీఫ్, విజయలక్ష్మి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు.



హెచ్‌డీఎస్ సమావేశం

ఉదయగిరి : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీఎస్) సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వైద్యశాలలో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వైద్యశాలలో ప్రస్తుతం ఉన్న అభివృద్ధి నిధులు రూ.3.50 లక్షలతో అవసరమైన పనులు చేపట్టాలని తీర్మానించారు. భవనాల కిటికీలకు మెష్‌ల ఏర్పాటు, దంత విభాగానికి మరమ్మతులు, పార్కింగ్ తదితర పనులకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అప్పాజీ, డీడీఓ ప్రశాంత్‌బాబు, కమిటీ సభ్యురాలు కలివేల జ్యోతి, వైద్యురాలు అనీస్‌సల్మా, కూటమి నాయకులు బయ్యన్న, నరసింహులు, చెన్నయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంజీఆర్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ

ఆత్మకూరు : దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు నియోజకవర్గ స్థాయి ఎంజీఆర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువత ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో పోటీలు ఉంటాయన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.10,116, రూ.7,116, రూ.5,116, రూ.3,116తో పాటు ట్రోఫీని బహూకరించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 79970 02558, 63007 33074 నంబర్లను సంప్రదించాలన్నారు.

స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం సమీపంలోని సర్వే నంబరు 158లో ఎస్సీలకు కేటాయించిన ఇంటి స్థలాలను కొందరు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమిస్తున్నారని మంగళవారం పలువురు ఎస్సీలు తహసీల్దార్ సుభద్రకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తమకు మంజూరు చేసిన ఇంటి స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అర్హులైన నిరుపేదలకు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దుత్తలూరు : దుత్తలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఎస్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాశీనాయన వంశస్థుడు బాలిరెడ్డి మృతి



సీతారామపురం : అవధూత కాశీనాయన తమ్ముడి కుమారుడైన మున్నెల్లి బాలిరెడ్డి (85) మంగళవారం గుండెపోటుతో మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కాశీనాయన తదనంతరం ఆశ్రమ బాధ్యతలను బాలిరెడ్డి చూసుకుంటున్నారు. ఈయన అకాల మరణంతో బెడుసుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో పాటు పలువురు బాలిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


ఉదయగిరి : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు


అల్లూరు డిగ్రీ కళాశాలలో..


దుత్తలూరు : మాట్లాడుతున్న ఎంఈఓ వెంగయ్య


సీతారామపురం : అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలీ


చేజర్ల ఉన్నత పాఠశాలలో..

ఉదయగిరి : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదటి విడతగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణా తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. 3–6 ఏళ్ల చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పడం, తల్లిదండ్రులకు ఆరోగ్య సంబంధమైన సలహాలు ఇవ్వడం, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, విద్యార్థుల మానసిక పరిపక్వతను పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ బాలకేశవులు, రిసోర్సు పర్సన్లు సుబ్బారెడ్డి, సారథి, ఫణికుమార్ పాల్గొన్నారు.

- **జలదంకి** : మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ సమన్వయంతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ, కోర్సు డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. జలదంకి ఉన్నత పాఠశాలలో శిక్షణా కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హైమావతి, రాజేశ్వరి, అరుణ, సీఆర్పీలు పాల్గొన్నారు.
- **దుత్తలూరు** : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు ఎంఈఓ ఎస్.వెంగయ్య పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతిపై ఆరురోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిశు సంరక్షణ, అభివృద్ధికి సంబంధించిన నైపుణ్యాలను మెరుగుపరచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో డ్రాపౌట్లను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను పాల్గొన్నారు.
- **సీతారామపురం** : స్థానిక జెడ్పీ హైస్కూలులో జ్ఞానజ్యోతిపై అంగన్‌వాడీలకు తలపెట్టిన శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌వలీ పాల్గొని, అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పలువురు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- **చేజర్ల** : స్థానిక ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు మంగళవారం జరిగింది. ఎంఈఓ–2 మస్తానయ్య పాల్గొని, వారికి పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం హైమావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ, రిసోర్స్‌పర్సన్లు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.
- **అల్లూరు** : జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంఈఓలు రవీంద్రనాథ్, సునీత పాల్గొని, పలు సూచనలు చేశారు. హెచ్‌ఎంలు శ్రీనివాసులు, మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

సీతారామపురం : సేంద్రియ ఎరువుల వినియోగంతో భూములు సారవంతమై తెగుళ్లను మొక్కలు తట్టుకుంటాయని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అన్నారు. బసినేనిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. పంటలో యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకం, మిత్ర పురుగుల సంరక్షణ, వేప సంబంధ కషాయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న నువ్వు పంటను పరిశీలించి తెగుళ్లు, పురుగుల నివారణపై వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సాంబశివయ్య, వెటర్నరీ అసిస్టెంట్ విజయ్, వీఏఏ షబీనా, రైతులు పాల్గొన్నారు.

- **చేజర్ల** : రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేయించుకోవాలని మండల ఏఓ శశిధర్ తెలిపారు. మండలంలోని యనమదల, కోటితీర్థం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారి సుజాత, వీఏఏ హసన్‌కుమార్ పాల్గొన్నారు.
- **అల్లూరు** : మండలంలోని రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని సింగపేట గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.
- **ఉదయగిరి** : మండలంలోని కొండాయపాళెం, అప్పసముద్రం గ్రామాల్లో మండల ఏఓ అంజనేయనాయక్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి పంటను పరిశీలించి జాగ్రత్తలు వివరించారు.

ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. గుడినరవ రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.